

కౌంటింగ్ కేంద్రం వద్ద సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

● కమలాపురం ఆర్వో, జేసీ గణేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్వో గణేశ్‌కుమార్

కమలాపురం రూరల్, మే 21: కౌంటింగ్ కేంద్రం వద్ద సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని కమలాపురం ఆర్వో, జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌లో ఏజెంట్లుగా నియమించుకునే వారు ఎలాంటి కేసుల్లో ఉండకూడదన్నారు. అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకునేందుకు ముందుగానే వారి పేర్లను అందించాలన్నారు. కేసులు నమోదైనా, వేరే కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని ఎన్నికల ఏజెంట్లుగా నియమించుకో వద్దన్నారు. దానివలన చిన్న సమస్య వచ్చినా ఎన్నికల కమిషన్ కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అభ్యర్థుల పాస్, వెహికల్ పాస్, ఏజెంట్ల పాస్ కోసం ముందుగానే దరఖాస్తు ఇస్తే వాటిని పరిశీలించి అర్హత ఉన్నవారిని గుర్తించి ముందుగానే సమాచారం ఇస్తామన్నారు. జూన్ 4వ తేదీన ఏడు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, 8కి కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఒక అభ్యర్థి ఒక ఏజెంటును కూర్చోబెట్టుకోవచ్చ న్నారు. 14 రౌండ్లు ఎన్నికల లెక్కింపు ఉంటుందని అభ్యర్థులు అందుకను గుణంగా నడుచుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద చిన్న సమస్య సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అనుమానం ఉంటే వెంటనే తెలిపితే అక్కడే పరిష్కరిస్తామన్నారు.

వారం రోజుల ముందే ఏజెంట్ల వివరాలు ఇవ్వండి

● పులివెందుల ఆర్వో వెంకటేశులు

పులివెందుల టౌన్, మే 21: ఓట్ల లెక్కింపును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, వారం రోజుల ముందే ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని పులివెందుల ఆర్వో వెంకటేశులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఆర్వో కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు వారి తరపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమాచారాన్ని వారం ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వీరికి పాసులు అందిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 14మంది ఏజెంట్లను అనుమతిస్తారని అన్నారు. ఫారం-17సీలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిర్దిష్టమైన ఓట్ల సంఖ్యతో సరిచూస్తారని, కౌంటింగ్ సిబ్బంది ఆ సంఖ్య ఫారం-17 సి పార్ట్-2 నోట్ చేసుకుని దానిపై ఏజంట్ల సంతకం తీసుకుంటామన్నారు. అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారన్నారు. ఈవీఎంలలో పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయం తెలుస్తుందన్నారు. ఒక్కో రౌండ్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారని, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసి భద్రపరుస్తారని తెలిపారు. శాంతియుతంగా లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో అందరు సమష్టి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ జగదీశ్‌బాబు, ఆర్ఐ కృష్ణమోహన్, పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కడప (ఎడ్యుకేషన్), మే 21: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. 24వ తేదీ నుంచి జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 17,688 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు , మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు రెండోసంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లోని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, లైవ్ స్ట్రీమింగ్ చేయడం ద్వారా జిల్లా కంట్రోల్ రూముతో అనుసంధానం అయ్యాయన్నారు. ఆర్ఐవో ఆఫీసులో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని, అలాగే జిరాక్స్ షాపులను మూసివేయిస్తున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రతిరోజూ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తాయన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆగని ఇసుక దందా

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు సుప్రీంకోర్టు చెప్పిన తరువాత కూడా.. ఎక్కడా ఇసుక అక్రమ రవాణా ఆగకపోవడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ప్రతి జిల్లాలో కలెక్టర్ల నేతృత్వంలో పోలీసులు వివిధ విభాగాల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి అక్రమ తవ్వకాలను ఆపించాలని ఆదేశించింది. ఈ కమిటీలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులుగా కాకుండా సుప్రీంకోర్టు నియమించిన అధికారుల్లా వ్యవహరించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని తెలిపింది. లేకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించింది. కానీ ఈ హెచ్చరికలు ఏపీ జిల్లాలో అమలు కావడంలేదు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో.. ఇక్కడ పెన్నానదిలో రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సుప్రీంకోర్టుకే సవాలు విసురుతున్నారు.


పెన్నానదిలో నుంచి ఇసుక తరలింపు


రైల్వేబ్రిడ్జి వద్ద అక్రమంగా తరలిపోతున్న ఇసుక

● అనుమతులు లేకున్నా ఇసుక క్వారీలు
● పెన్నానదిలో భారీగా అక్రమ తవ్వకాలు
● రాత్రి పగలు యథేచ్ఛగా రవాణా
● లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీ
● సుప్రీంకోర్టు చెప్పినా లెక్కలేదా..?
● ఇసుక అక్రమ తవ్వకాల నిలిపివేతకు చర్యలేవీ

ప్రొద్దుటూరు, మే 21: ప్రొద్దుటూరు మండల పరిధిలో ఐదేళ్లుగా ఎక్కడా ఇసుక క్వారీకి ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. కానీ ఈ ఐదేళ్లలో లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక పెన్నానది నుంచి వైసీపీ నేతలు అక్రమంగా తరలించి రూ.వందల కోట్ల అక్రమార్జన పోగేసుకున్నారు. ఈ ఇసుక దందాతోనే ప్రొద్దుటూరు రాజకీయాలు మారిపోయాయి. గతంలో ఓటుకు రూ.500 ఇస్తే.. నేడు ఓటుకు రూ.3000 వరకు పంపిణీ జరగటం వెనుక ఇసుక దందానే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు..

ప్రకృతి వనరుల సంరక్షణ ఏదీ

మానవునికి ప్రాణాధారమైనవి నీళ్లు. ఆ నీళ్లు లభించే ప్రధాన వనరు నదులు. అలాంటి నదులలో ఉన్న ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరపడం వల్ల మానవునికి ప్రాణాధారమైన నీళ్లు లేకుండా పోయి కరువు పరిస్థితులు దాపురిస్తున్నాయి. నదిలో ఇసుక లేకుండా గుల్ల చేస్తే సహజమైన నీటి వడపోత మాయం అవుతుంది. అందువల్ల నీటిలో ఖనిజ లవణాలు పోయి సారహీనమైన నీరు బోర్లకు వస్తుంది. అందులో నేడు టీడీఎస్ శాతం 500 మించి ఉంటోంది. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 3 లక్షలకు పైగా ఉన్న జనాభాకు తాగునీటి సౌకర్యం కోసం ఉన్న ఏకైక ఆధారం పెన్నా రివర్‌బెడ్ మాత్రమే. ఈ నదిలో ఇసుకను మటుమాయం చేస్తే రాబోవు తరాలు కరువు బారిన పడకతప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మైలవరం నుంచి పైపులైను ద్వారా తీసుకొస్తున్న నీటిని నేరుగా ఫిల్టర్ చేసి రిజర్వాయర్లకు సరఫరా చేస్తున్నారు. అయినా ఆ నీరు బురద రంగులో ఉంటోంది. ఈ నీటిని మున్సిపాలిటీ అందిస్తున్నప్పటికీ తాగటానికి ప్రజలు వినియోగించడంలేదు. తాగటానికి ఆర్‌వో వాటర్‌ను ఇంటింటికి వచ్చే ఆటోల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు కారణం మున్సిపాలిటీ కుళాయిల ద్వారా వచ్చే నీటిలో టీడీఎస్ శాతం అధికంగా ఉండటం.

పెన్నానదిలో ఇసుక తిన్నెలు మాయం

గత ఐదేళ్ల కాలంలో పెన్నానదిలో ఇసుక తిన్నెలు మాయం అయ్యాయి. నదిలో చాలా చోట్ల రాళ్లు బయట పడుతున్నాయి. నది స్వరూపం మారిపోయింది. ఇందుకు కారణం మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగటం. ప్రొద్దుటూరు మండల పరిధిలోని చౌడూరు నుంచి పెద్దశెట్టిపల్లె, కొత్తపేట, చౌటపల్లె, రామాపురం, దొరసానిపల్లె, రామేశ్వరం, ఈశ్వరరెడ్డినగర్ పెన్నానగర్, నంగనూరు పల్లె, తాళ్లమాపురం, కల్లూరు వరకు.. దాదాపు 20 కిలోమీటర్ల మేర పెన్నానదిని ఇసుకాసురులు ధ్వంసం చేశారు. రాత్రిపగలు తవ్వకాలు జరిపి సుదూర ప్రాంతాలకు తరలించి కోట్లు గడించారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ కమిటీలెక్కడా?

ఆంధ్రప్రదేశ్‌లో అనుమతులు లేకుండా సాగుతున్న ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాపై కలెక్టర్ల నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీలు వేయమని సుప్రీంకోర్టు మే 16న ఆదేశించినా.. ఆ కమిటీల జాడ కానరావడం లేదు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాలలో పెన్నానదిలో విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. కానీ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలు ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలించిన దాఖలాలు లేవు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం కోసం పోలీసు, రెవెన్యూ, ఏసీబీ, మైనింగ్ శాఖల సిబ్బందితో ఇంకా కమిటీనే నియమించలేదు. దీంతో మంగళవారం కూడా ప్రొద్దుటూరు వద్ద పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా అడ్డూఅదుపూ లేకుండా సాగింది. ఈనిపై ప్రొద్దుటూరు తహశీల్దార్ విద్యాసాగర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నేడు కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


పెన్నానదిలో వాటర్ వర్క్స్ రైల్వేబ్రిడ్జి వద్ద అక్రమ తవ్వకాలతో ఇసుకతిన్నెలు చదును అయిన దృశ్యం


రామేశ్వరం దేవళాల ముందు నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా సాగుతున్న ఇసుక రవాణా

● కడపలో మాక్ డ్రిల్

రెండుచోట్ల కార్డన్ సెర్చ్

కడప (క్రైం) / కలసపాడు/ ముద్దనూరు, మే 21 : రాష్ట్రంలో ఎన్నికల తరువాత చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో మంగళవారం రెండు చోట్ల పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోరుమామిళ్ల సీఐ ఆధ్వర్యంలో మూడుస్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది కలసపాడు మండలంలోని చింతలపల్లె గ్రామంలో నాకాబంది, కవాతు, గ్రామసభ నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యలాపాలకు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం, మందుగుండు సామగ్రి రవాణా చేసినా.. తమ వద్ద ఉంచుకున్నా కఠిన చర్యలు ఉంటాయన్నారు. గొడవలు సృష్టించిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముద్దనూరు మండల పరిధి చింతకుంట గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు తనిఖీ నిర్వహించారు. గ్రామంలోని అనుమానాస్పద గడ్డివాములు, ఇళ్లు తనిఖీ చేశారు.

కడప నగరం క్రిష్ణ సర్కిల్ వద్ద స్పెషల్ పార్టీ బృందాలతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ ఎండీ షరీఫ్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల సమయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు వారి అనుచరులు పెద్దసంఖ్యలో కడపకు వస్తారని, గొడవలకు పాల్పడితే మాత్రం ఉపేక్షించేది ఉండదని స్పష్టం చేశారు. పార్టీ నాయకులే కాకుండా ప్రజలు వారి కార్యకర్తలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు.


ముద్దనూరు మండలం చింతకుంటలో పోలీసుల తనిఖీలు


కడప క్రిష్ణ సర్కిల్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

కోనేటిలో తెప్పపై విహరిస్తున్న దేవుని కడప వేంకటేశ్వరుడు



నయనానందకరం స్వామివారి తెప్పోత్సవం

కడప (కల్చరల్) మే 21: తిరుమల తొలి గడప దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెప్పోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయ సమీప పుష్కరిణిలో (కోనేరు) సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ స్వామివారి తెప్పోత్సవం నయనానంద కరంగా సాగింది. స్వామివారు శ్రీ కృష్ణుడి వేషధారణలో గోదాదేవి సమేతంగా పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తొలుత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో స్వామివారి తెప్పోత్సవం ఆద్యంతం ఆనందకర వాతావరణంలో సాగింది. గురువారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)కి వైద్యం కోసం వచ్చి చనిపోతే వారి శవాలను ఉచితంగా బంధువుల చెంతకు చేర్చేందుకు మహాప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేశారు. 2017లో అప్పటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం హయాంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వీటిని ప్రారంభించారు. అదేస్థాయిలో సేవలు కూడా అందేవి. కానీ నేడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా తయారైంది. సిబ్బంది చేతిలో డబ్బులు పడందే వాహనాలు ముందుకు కదలని పరిస్థితి. దీంతో ఇక్కడ చావుప్రయాణం పేదలకు భారంగా మారింది.



చావు ప్రయాణం.. భారమాయె

● సర్వజన ఆసుపత్రిలో మహాప్రస్థానం వాహనాల కొరత
● శవాల తరలింపులో సిబ్బంది చేతివాటం.. బలవంతపు వసూళ్లు
● ప్రైవేటు అంబులెన్స్‌లకు కాసుల పంట



కడప (సెవెన్‌రోడ్స్), మే 21: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పేరుకు మాత్రమే మహాప్రస్థానం వాహనాల ఉంటాయి. ప్రజలకు మాత్రం అందుబాటులో లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోనే కాక పక్క జిల్లాల ప్రజలు సైతం వైద్యం కోసం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వస్తుంటారు. కానీ సేవలను అందించడంలోనూ, సేవలను ఏర్పాటు చేయడంలోనూ ఆసుపత్రి అధికారులు విఫలం అయినట్లు ప్రజలు అంటున్నారు.

డబ్బుల వసూళ్లు

మహాప్రస్థానం వాహనాల పనితీరుపై, సేవలపై ఎప్పటి నుంచో విమర్శలున్నాయి. ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన రోగులు మృతి చెందితే వారి మృతదేహాలను స్వగ్రామాలకు ఉచితంగా తరలించేందుకు ఈ వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉచితంగా సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ రోగుల నుంచి ఈ వాహనాల సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తుంటారనే ఆరోపణలున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు రూపాయి చెల్లించకుండా ఈ సేవలు పొందవచ్చు. అయితే ఆసుపత్రి నుంచి బయల్దేరిన తరువాత మార్గమధ్యంలోనే సిబ్బంది డబ్బులు వసూలు చేస్తుండడం గమనార్హం. దూరాన్ని బట్టి కనీసం రూ.500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తుంటారు.


ప్రైవేటు అంబులెన్స్‌లతో కుమ్మక్కు

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కేవలం రెండు మాత్రమే మహాప్రస్థానం వాహనాలు ఉన్నాయి. అవి కూడా ఏదోఒక రిపేరు అంటూ ప్రజలకు అందుబాటులో ఉంచడంలేదు. వీటి నిర్వహణకు సంబంధించిన వ్యవహారం అంతా విజయవాడ పరిధి కార్యాలయంలో ఉండడంతో చిన్నపాటి మరమ్మతుకు గురైనా వాహనాన్ని విజయవాడ తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇవి ఎప్పుడు అందుబాటులో ఉంటాయో, ఉండవో కూడా తెలియదు. ఒకవేళ అందుబాటులో ఉన్నా రిపేరు ఉందంటూ.. తెలిసిన అంబులెన్స్ ఉంది, తక్కువకే వస్తారు అనిచెప్పి ప్రైవేటు అంబులెన్స్ వారి నెంబరు ఇవ్వడం, తరువాత అంబులెన్స్ వారి వద్ద కమీషన్లు తీసుకుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడలో మహాప్రస్థానం వాహనాలకు సంబంధించి కార్యాలయం ఉండడం వల్ల ఏదైనా చిన్నపాటి రిపేరు అయినా మరమ్మతులకు వెళితే పది పదిహేను రోజులైనా వాహనం అందుబాటులో ఉండదు. దీని వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి మహాప్రస్థానం వాహనాలను నిత్యం అందుబాటులో ఉంచాలని, అలాగే బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు..

మహాప్రస్థానం వాహన సేవలు పూర్తిగా ఉచితం. మృతుల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసి సిబ్బందిని పిలిచి మందలించాం. డబ్బులు ఇచ్చిన వారు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. డబ్బు వసూళ్లకు పాల్పడితే ప్రజలు నిర్భయంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. మహాప్రస్థానం వాహనాలకు ఎవ్వరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. వాహనాలు అందుబాటులో లేకపోతే ఆర్‌ఎంవోను, సంబంధిత ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించవచ్చు.

- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంవో, సర్వజన ఆసుపత్రి, కడప


ఎండిపోయిన చీనీచెట్లు

800 చీనీచెట్లు ఎండిపోయాయి

● వర్షాభావంతో అడుగంటిన భూగర్భజలాలు
● ఐదుబోర్లు వేసినా ఫలితం శూన్యం

చక్రాయపేట, మే 21: సీఎం వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలో రైతులు కరువుతో అల్లాడుతున్నారు. తీవ్ర వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోవడంతో.. చీనీ తోటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రైతులు చేసే భగీరథ ప్రయత్నం ఫలించక అప్పుల్లో కూరుకుపోతున్నారు.

చక్రాయపేట మండలం బయమ్మగారిపల్లెకు చెందిన బ్రహ్మదేవుని సుధాకరరెడ్డి 800చీనీచెట్లు నాటాడు. ఐదేళ్లుగా వీటిని బోరుబావి నీటితో సంరక్షిస్తున్నాడు. ఇప్పుడు కాపుదశలో ఉన్నాయి. ఈ సమయంలో భూగర్భజలాలు అడుగంటడంతో బోరులో నీళ్లు రాలేదు. దీంతో చీనీచెట్లను కాపాడుకునేందుకు మరోబోరు వేశాడు. అందులోనూ నీళ్లురాలేదు. దీంతో మరోబోరు.. మరోబోరు.. ఇలా ఐదుబోర్లు వేసినా నీళ్లు పడకపోవడంతో 800 చీనీచెట్లు నిట్టనిలువునా ఎండిపోయాయి. ఎండిపోయిన చెట్లను ఉద్యానశాఖ అధికారి రెడ్డెయ్య మంగళవారం పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక తెలియజేస్తానన్నారు. తనకు బోర్లు వేయడానికే రూ.8లక్షలు ఖర్చు అయిందని, అప్పు చేసి బోర్లు వేయడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మరోవైపు పంట ఎండిపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

● సిబ్బందితో ఎస్పీ సిద్ధార్థ కౌశల్


మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కమలాపురం రూరల్, మే 21: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. కమలాపురం నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్షలో కౌంటింగ్ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ, ఎవరు, ఎలా విధులు నిర్వహించాలో ఆదేశాలిచ్చారు. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే రాజకీయ నేతల గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలు చేస్తామని వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కూడా నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కడప డీఎస్పీ షరీఫ్, నియోజకవర్గ నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు రాజు, కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి, సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్, కడప రూరల్ సీఐ నాగరాజు, చెన్నూరు సీఐ పార్థసారధి, ఎస్ఐలు హృషికేశవరెడ్డి, వెంకటరమణ, వెంకటరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (నాగరాజుపేట), మే 21: టెంజింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ తెలిపారు. కమిషనర్, యువజన సర్వీసుల శాఖ, విజయవాడ, కలెక్టరు ఆదేశాల మేరకు వివిధ సాహస కృత్యాలు చేసిన వారికి భూమి, నీటి, గాలిలో జీవిత సాఫల్య పురస్కారం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా జూన్ 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మేనేజరు వీవీ సుబ్బరాయుడు, 9949298810, జూనియర్ అసిస్టెంటు టి.నాగయ్య 9849497011 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

న్యాయవ్యవస్థ తీర్పును లెక్క చేయని జగన్


సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), మే 21: పదేళ్లలో నరేంద్రమోదీ ప్రభుత్వం, ఐదేళ్లలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క మంచిపని చేయలేదని, ప్రాజెక్టులు, పరిశ్రమలు నెలకొల్పలేదని చివరికి పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తారని చెప్పడం దారుణమన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను హైకోర్టు నిలుపుదల చేయాలని చెప్పినా జగన్ లెక్కచేయకుండా లక్షలాది భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేలా పాలసీ చేశారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందరెడ్డి, నగర కార్యదర్శి మద్దిలేటి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు న్యాయం జరగాలి

వైస్ చాన్సలర్ చింతా సుధాకర్


మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

కడప (ఎడ్యుకేషన్), మే 21: సమాధాన పత్రాలు దిద్దేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి ప్రతిభావంతులకు న్యాయం జరగాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తి చేయాలన్నారు. మంగళవారం వైవీయూలో జరుగుతున్న మూల్యాంకన కేంద్రాలన్నీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మూల్యాంకన విధులకు వచ్చిన అధ్యాపకుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి మూల్యాంకనం పూర్తి చేయాలని తద్వారా త్వరితగతిన ఫలితాలు ఇవ్వడం వలన విద్యాసంవత్సరం సరైన సమయంలో ప్రారంభమవుతుందన్నారు. విధులకు ఎంపికైన ప్రతి అధ్యాపకుడు రోజూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

భారీవాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు : ఆర్డీవో


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు మే 21: సిమెంట్ లోడు లారీ ఈనెల 17వ తేదీ రాత్రి స్థానిక విజయలక్ష్మి ఇంటిలోకి దూసుకు వెళ్లిన విషయం అందరికీ విదితమే. కాగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు చేపడతామని ఆర్డీవో శ్రీనివాసులు హామీ ఇచ్చారు. విజయలక్ష్మి ఇంటిలో డ్వాక్రా గ్రూపు నుంచి లోన్ తీసుకుని దుస్తులు, ఫ్యాన్సీ దుకాణం నడుపుతోంది. లారీ ఢీకొనడంతో ఇంటి మూడు రూములు, దుకాణంలోని వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈప్రమాదంలో ప్రక్కనే ఉన్న అక్బర్ బాషా,సుధాకర్ ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ దస్తగిరి, ఎంవీఐ ప్రసాద్, ఆర్అండ్‌బీ, రెవిన్యూ అధికారులు దెబ్బతిన్న ఇళ్లను, దుకాణాన్ని మంగళవారం పరిశీలించారు. ఇళ్లు చాలా ప్రమాదకరంగా ఉందని ఇంటి వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు. అనంతరం ఆర్డీవో బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడుసార్లు లారీ తగలడంతో ఆర్థికంగా నష్టపోయామన్నారు. ప్రమాదం జరిగిన లారీ, చనిపోయిన డ్రైవర్‌కు, సిమెంట్‌కు ఇన్సూరెన్స్ వస్తుందని, ఇళ్లు పడిపోయి ఆస్తినష్టం జరిగిన మాకు ఎటువంటి ఆర్థిక సహాయం అందడంలేదన్నారు. మూడుసార్లు సొంత ఖర్చులతో ఇల్లు మరమ్మతులు చేసుకున్నామన్నారు. కాగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీవో తెలిపారు.

9 నెమళ్లు మృత్యువాత



పెద్దముడియం, మే 21 : మండల పరిధిలోని నెమళ్లదిన్నె శివారులో మంగళవారం 9 నెమళ్లు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, పోలీసులు అటవీశాఖ అధికారుల వివరాల మేరకు.. నెమళ్లదిన్నె, ఉప్పలూరు గ్రామాల మధ్య కేసీ కాల్వ, కుందూ నది మధ్యలో ఉన్న ఓ వంక వద్ద నెమళ్లు ఓ కుప్పగా మృత్యువాత పడి దర్శనమిచ్చాయి. స్థానికులు గమనించి ఈ సమాచారం పెద్దముడియం పోలీసులకు అందించారు. వారు సంఘటనాస్థలాన్ని చేరుకుని నెమళ్ల మృతి చెందిన పరిస్థితిని గమనించి ఈ విషయం అటవీ శాఖాధికారులకు తెలిపారు. వెంటనే ముద్దనూరు అటవీ శాఖ అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతి చెందిన నెమళ్లను పరిశీలించి వైద్యాధికారులచే పోస్టుమార్టం నిర్వహించారు. అయితే నెమళ్ల మృతికి కలుషిత నీరే కారణమై ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అయితే ఒకేచోట 9 నెమళ్లు మృత్యువాత పడడంతో ఈ సంఘటన చర్చనీయాంశమైంది. అయితే ఇందులో ఎలాంటి కోణం లేదని కలుషిత నీరు, వాతావరణ మార్పుల కారణంగానే నెమళ్లు మృతి చెంది ఉండవచ్చని అటవీ, పశువైద్యాధికారులు అంచనా వేశారు. పోస్టుమార్టం తరువాత స్థానికంగానే నెమళ్లను ఖననం చేశారు.

లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

● ప్రారంభానికి నోచుకోని ప్రొద్దుటూరు రైతుబజారు ● కడపలో అసౌకర్యాలతో ప్రజల బేజారు



నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న ప్రొద్దుటూరు రైతుబజారు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 21: జగన్ ప్రభుత్వంలో రైతుబజార్లు నిర్వీర్యమయ్యాయి. రైతులకు ఉపాధి, ప్రజలకు సౌకర్యవంతమైన మార్కెట్ సదుపాయం కల్పించేందుకు రైతుబజార్లు ఏర్పాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. ఒక పక్క టీడీపీ హయాంలో నిర్మించిన రైతు బజార్లను వినియోగించుకోకుండా వదిలేయడంతో పాటు ఇప్పటికే వినియోగంలో ఉన్న రైతుబజార్లను ఆధునీకరించడం కానీ, మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది.

ప్రొద్దుటూరులో నిరుపయోగంగా..

ప్రజలకు సరసమైన ధరలకు తాజా కూరగాయలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రొద్దుటూరులోని మార్కెట్‌యార్డు ఆవరణలో రైతు బజారు నిర్మించింది. 2017 అక్టోబరు 20న అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖమంత్రి ఆదినారాయణరెడ్డి కలిసి ప్రొద్దుటూరులో రైతు బజారుకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత పనులు పూర్తయినప్పటికీ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రైతు బజారును పూర్తిగా నిర్వీర్యం చేసింది. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో నిర్మించారనే కారణంతో ఈ రైతుబజారును వైసీపీ పాలకులు పూర్తిగా వదిలేశారు.

గతంలో ప్రొద్దుటూరు శివాలయం సెంటరులో కూరగాయల మార్కెట్ ఉండేది. వైసీపీ అధికారం చేపట్టాక అక్కడ షాపింగ్‌మాల్ నిర్మిస్తామంటూ మార్కెట్‌ను తొలగించారు. కొద్దికాలం పాటు వ్యాపారులు, రైతులు సరైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు కూడా ఈ రైతుబజారును ప్రారంభించలేదు. ఒకానొకసందర్భంలో పురపాలక సంఘం అధికారులు తాత్కాలిక మార్కెట్‌యార్డు పేరుతో రైతు బజారును పరిశీలించారు. కానీ అధికార పార్టీకి చెందిన నేతలు కేవలం అది టీడీపీ వారు నిర్మించారనే ఆలోచనతో పక్కనబెట్టినట్లు గతంలో చర్చ సాగింది. ఆ తరువాత మున్సిపల్ స్కూలు మైదానంలో కూరగాయల మార్కెట్‌కు షెడ్లు నిర్మించారు. దీంతో రైతు బజారు పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మారింది. ప్రజలకు సంబంధించిన ఆస్తులను రాజకీయప్రయోజనాల కోసం వదిలివేయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

కడపలో అసౌకర్యాల నడుమ..

కడప రైతు బజారులో ఉల్లి, కేరట్, టమోటా, బంగాళాదుంప, బీట్‌రూట్.. ఇలా ఏ కూరగాయ అయినా నాశిరకంగా ఉంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. నిత్యం వందలాది మంది కడప నగరంలోని రైతుబజారుకు వస్తుంటారు. కానీ జనాలకు తగినన్ని కనీస సౌకర్యాలు ఇక్కడ లేవు. తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. ఇక్కడ పరిశుభ్రత లేకపోవడంతో ఆర్వో ప్లాంటు ఉన్నప్పటికీ లేదనే విధంగా మారింది. మరుగుదొడ్ల విషయానికి వస్తే మూత్ర విసర్జనకు వెళ్లినా అధికంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఉమ్మడి ఏపీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కడపలో ఏర్పాటు అయిన రైతుబజారుకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వర్షం వస్తే రైతుబజారు పూర్తిగా బురదమయం అవుతుంది.

పార్కింగ్ సమస్య

కడప రైతుబజారు వద్ద కూరగాయల కొనుగోలుకు వచ్చే వినియోగదారులు వాహనాలను పార్కింగ్ చేయాలంటే ఓ పెద్ద సమస్యగా మారుతోంది. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. జిల్లా పరిషత్ కార్యాలయం వైపు గతంలో ఖాళీగా ఉండేది. ఇప్పుడు అక్కడ కూడా భవన సముదాయాల నిర్మాణం జరగడంతో ఈ సమస్య మరింత జటిలమయ్యే అవకాశాలున్నాయి. రైతుబజారుకు వచ్చే ప్రజల కోసం వాహనపార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.


కనీస వసతుల్లేని కడప రైతుబజారు

‘కోన’లో పెంచులోరి వైభోగం

● స్వర్ణ హనుమంతుడిపై భక్తులకు దర్శనం


సరస్వతీదేవి అలంకరణలో ఊరేగుతున్న శ్రీవారు

రాపూరు (డక్కిలి), మే 21 : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో శ్రీవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండపంలో స్వామివారిని విశేషంగా తీర్చిదిద్ది హంస వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణలతో కోన క్షేత్రం మారుమోగింది. ఆ తర్వాత ఊంజల్ సేవ, తిరుమంజనం సేవలు జరిగాయి. వివిధ సేవలతో అలసిన శ్రీవారిని సేదతీర్చేందుకు అర్చకులు స్నపన, తిరుమంజనం జరిపించారు. దేవదేవుళ్ల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్లరసాలు, చందనం, పసుపు, కొబ్బరి నీటితో అభిషేకించారు.

హనుమపై వైభోగం

శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి రాత్రి బంగారు హనుమంతుడిపై విహరించారు. మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు గరుడవాహన సేవ

బుధవారం నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు తనకిష్టమైన స్వర్ణగరుడ వాహనంపై విహరించనున్నారు. ఈ వేడుకలను తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు 120కి పైగా బస్సులను తిప్పనున్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

మైదుకూరు, మే 21 : ఖాజీపేట మండలం పుల్లూరులో పోలింగ్ రోజున జరిగిన దాడి కేసులో వైసీపీకి చెందిన ఐదుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 13న పుల్లూరులో హరిజనవాడకు చెందిన టీడీపీ కార్యకర్త జి.చిన్నయ్య ఇంటికి వెళ్తుండగా రహ్మత్‌ఖాన్ పల్లెకు చెందిన ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు మరో నలుగురు కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని, తీవ్ర రక్త గాయాలయ్యాయని చెన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ వెంకటేసులు విచారణ జరిపి మంగళవారం ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచారు. కాగా కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేసులు తెలిపారు.

ఆగి వున్న లారీని ఢీకొన్న కారు

● ఐదుగురికి తీవ్రగాయాలు
● గాయపడిన వారు హైదరాబాదు వాసులు



తీవ్రంగా గాయపడ్డ రేణుకారెడ్డి, గాయపడ్డ సుఖేందర్‌రెడ్డి

రైల్వేకోడూరు, మే 21 : మండలంలోని రాఘవరాజపురం గ్రామ సమీపంలో వున్న ఓ పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం ఆగి వున్న లారీని కారు ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాదుకు చెందిన ఒకే కుటుంబం వారు ఆదివారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో రైల్వేకోడూరు మీదుగా వెళ్తుండగా రాఘవరాజపురం వద్ద ఓ పెట్రోల్ బంకు ఎదురుగా ప్రధాన రహదారిలో ఆగి వున్న లారీని కారు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సుఖేందర్‌రెడ్డి, రాందేవి, దీక్షిత్‌రెడ్డి, రేణుకారెడ్డి, మోహిత్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రాఘవరాజపురం గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అసాంఘిక శక్తుల అడ్డాగా పులివెందుల

మామిడిచెట్లను నరకడం అమానుషం : తులసిరెడ్డి


మారెళ్లమడకలో మామిడిచెట్లను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

చక్రాయపేట, మే 21: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం అసాంఘికశక్తుల అడ్డాగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలం, మారెళ్లమడక వాసులు బొజ్జా పార్థసారధిరెడ్డి, వాసుదేవరెడ్డి, యోగాంజులరెడ్డిలకు చెందిన మామిడి తోటలో 120మామిడిచెట్లను గుర్తుతెలియని దుండగులు నరికారన్నారు. దాదాపు రూ.8లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. మంగళవారం మామిచెట్లను తులసిరెడ్డి పరిశీలించి ఆవేదన చెందారు. ఇది చాలా దుర్మార్గమైన, అమానుషమైన చర్య అన్నారు. దుండగులను తక్షణం గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, వేమయ్య, రాజు పాల్గొన్నారు.

వైభవంగా నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెద్ద శేష వాహనంపై నారాపుర వెంకటేశ్వరస్వామి, గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు

జమ్మలమడుగు మే21 : జమ్మలమడుగులో శ్రీనారాపురం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగ్లవారం రెండవ రోజు ఆలయ ప్రాంగణంలో భక్తులకు పండితులు అధికారుల మధ్య ధ్వజారోహణ చతుష్టార్చన కార్యక్రమం జరిగింది .అనంతరం బేరితాడనం దేవతహం ఆస్థానం సాయంత్రం ఊంజల సేవ అన్నమాచార్యుల కీర్తన లు రాత్రి పెద్దశేష వాహనంలో ఊరేగింపు .జరుగుతుందన్నారు.

రేపు పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె, మే 21: ఎన్.పాలగిరి క్రాస్ వద్ద అవదూత కాశిరెడ్డి నాయన, శిరిడిసాయి ఆలయాల్లో గురువారం పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి తెలిపారు.

దుర్గంధ భరితం బస్టాండు కేంద్రం

మరుగు దొడ్డి నుంచి లీక్ అవుతున్న మురుగునీరు ● చోద్యం చూస్తున్న అధికారులు



బస్సులు నిలబడే చోట లీక్ అవుతున్న డ్రైనేజీ నీరు, అటుగా వర్షపు నీరు

కడప (మారుతీనగర్) మే 21: అది ఘనత వహించిన జిల్లా కేంద్రం కడపలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి బస్టాండు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులతో నిత్యం రద్దీగా వుంటుంది. ఆర్టీసీ బస్సులపై ప్రయాణీకులే మా దేవుళ్ళు.. ప్రయాణీకుల పట్ల గౌరవంగా మెలగుతాం అనే రాతలు గతంలో ఉండేవి. కాలగమనంలో అవి కనుమరుగైపోయాయి. నిత్యం కడప డిపో బస్సులే కాకుండా ఇతర జిల్లాల, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వందలాది బస్సులు కడప మీదుగా రాక,పోకలు సాగిస్తుంటాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు బస్సుల కోసం బస్టాండులో వేచి ఉంటారు. ప్రయాణీకుల కోసం బస్టాండులో కుర్చీలు, ఫ్యాన్లు ఇదివరకే యాజమాన్యం ఏర్పాటు చేసింది. అక్కడున్న కుర్చీల్లో సేదతీరుతూ వారు వెళ్లాల్సిన ఊరు తాలూకు బస్సు రాగానే వెళ్తుంటారు. అంతలా ప్రయాణీకుల సేవలో ఆర్టీసీ యాజమాన్యం తరిస్తోంది. ఉద్యోగులు సైతం ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చి ఆర్టీసీ పట్ల ప్రజల విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసేలా విధులు నిర్వహిస్తున్నారు.

పేరుకు మాత్రమే...

ప్రయాణీకులే మా దేవుళ్ళు అన్న విధానం పేరుకే అన్నట్లుగా మారిపోయింది. బస్టాండులో వేచివున్న ప్రయాణీకులు ఏదేని తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, నీటిబాటిల్ కొనాలన్నా నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. డిపో అధికారులేమో అలా అమ్మడానికి వీల్లేదని చెబుతున్నా వ్యాపారుల తీరు మారడంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షానికి బస్టాండు దుర్గంధభరితంగా తయారైంది. బస్టాండు నలువైపులా వర్షపు నీరు నిలబడిపోవడం, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణీకులు త్వరితగతిన బస్టాండుకు చేరుకునే క్రమంలో నిల్వవున్న వర్షపు నీటిలో నుంచే ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా చేరుకోవాల్సిన దుస్థితి దాపురించింది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా అసలే బస్టాండు నలవైపులా నిల్వ వున్న వర్షపు నీటికి తోడుగా అక్కడున్న బాత్‌రూమ్‌ల తాలూకు డ్రైనేజీ నీరు పైపులు లీక్ అవుతున్నాయి. దీంతో వర్షపు నీటికి అదనంగా డ్రైనేజీ నీరు చేరడంతో బస్టాండు ఆవరణ మరింత దుర్గంధ భరితంగా మారింది.

చోద్యం చూస్తున్న అధికారులు

కొద్ది రోజులుగా బస్టాండులో వర్షపు నీరు డ్రైనేజీ నీరు నిల్వగా మారి ప్రయాణీకులు కాసింత అసహనానికి గురౌతున్నా సంబంధిత డిపో అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్న తీరు సరైందికాదని పలువురు ప్రయాణీకులు బాహాటంగా అంటున్నారు. వారాల తరబడి నీరు నిల్వున్నా అధికారుల్లో స్పందన లేకుండా మిన్నకుండడం విడ్డూరంగా వుంది. ఎంతసేపు ప్రయాణీకుల వద్ద నుంచి ఆర్టీసీకి డబ్బులైతే కావాలే కానీ వారి ఆరోగ్య పరిరక్షణ పట్ల ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంలోని బస్టాండు ఇంతలా దుర్వాసన వెదజల్లుతున్నా మాకెందుకులే అన్నట్లుగా అధికారులు ప్రవర్తిస్తున్న తీరిది.

ఇక్కట్లలో ప్రయాణీకులు

ఆర్టీసీ బస్సుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు బస్టాండుకు చేరుకోవాలంటే నాలుగు దారులున్నాయి. వాటిల్లో అవుట్ గేట్ వద్ద వర్షపునీరు నిండుకుంది. ఇన్‌గేట్ లోనికెళ్లగానే ఎడమవైపున వర్షపునీరు నిల్వగా దర్శనమిస్తున్నాయి. తర్వాత బస్టాండ్ లోనికెళ్లే అంబేడ్కర్ సర్కిల్ వద్ద సమీప దారిలో రెండు వారాలుగా డ్రైనేజీ కాల్వలోని మురికినీరు నిల్వగా మారింది. ఆ నీటికి తోడుగా వర్షపు నీరు చేరడంతో మరింత జఠిలంగా మారి ఆ దారి గుండా వెళ్లే ప్రయాణీకులకు ఇక్కట్లకు గురికావాల్సివస్తోంది.



బస్టాండు నుంచి వర్షపు నీటిలో బయటకు వెళ్తున్న ఆటో

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తహసీల్దారు ప్రకాశ్‌బాబు

చెన్నూరు, మే 21: చెన్నూరు మండల వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను వేగవంతం చేయాలని కనుపర్తి వద్ద ఉన్న లే అవుట్‌లో పక్కాగృహాలు మరింత వేగంగా పూర్తి చేయించాలని తహసీల్దారు ప్రకాశ్‌బాబు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, హౌసింగ్ ఏఈ మినిల్‌కుమార్‌తో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు, వేసవి దృష్ట్యా నిర్మాణాలు మందకొడిగా సాగడం కొన్ని రోజులు ఆగిపోయాయన్నారు. ఇప్పుడు వాతావరణం కాస్త చల్లబడిందని లేబర్ పనులు లేవు కాబట్టి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కనుపర్తి లేఅవట్‌పై దృష్టిసారించి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. ఆలస్యం పనికిరాదని, అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంది కాబట్టి నిర్మాణాలు వేగవంతం చేస్తూ రోజూ సంబంధిత హౌసింగ్ ఏఈ పర్యవేక్షించాలన్నారు.

సింహాద్రిపురంలో ప్రత్యేక అధికారి...

సింహాద్రిపురం, మే 21: మండలంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం హౌసింగ్ నిర్మాణాలపై సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సల్మాన్‌రాజ్, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, హౌసింగ్, పీఆర్ ఏఈలు వాసుదేవరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ బకాయిలు వెంటనే చెల్లించాలి : యూటీఎఫ్



డీఈఓ అనురాధకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), మే 21: సమగ్రశిక్ష పథకం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జరిగిన శిక్షణ తరగతుల బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు సమగ్ర శిక్ష పథక జిల్లా సంచాలకులు ఎం.అనురాధను కోరారు. మంగళవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమగ్ర శిక్ష పథక సంచాలకులను కలిసి యూటీఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం ఇచ్చిన వారు మాట్లాడుతూ గతేడాది ఆగష్టు, సెప్టెంబరు నెలల్లో మదనపల్లి కేంద్రంగా 10 విడతలుగా ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ లీడర్‌షిప్ మేనేజ్‌మెంటుపై శిక్షణ తరగతులు నిర్వహించారన్నారు. ఈ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రవాణా భత్యం నేటికీ చెల్లించలేదని సమగ్ర శిక్ష సంచాలకుల దృష్టికి తెచ్చారు. బకాయిలను వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గతేడాది నవంబరులో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలకు జరిగిన శిక్షణ తరగతుల బకాయిలు కూడా చెల్లించలేదని వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. సమగ్రశిక్ష పథక జిల్లా సంచాలకులు మాట్లాడుతూ శిక్షణ తరగతుల బకాయిల విషయం రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి, మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

పెన్నాలో నీటి ప్రవాహం



చెన్నూరు వద్ద పెన్నానదిలో నీటి ప్రవాహం

చెన్నూరు, మే 21: ఇటీవల వేసవి తాకిడికి పెన్నాలో పూర్తిగా నీరు ఎండిపోయి ఇసుకలో ఐదడుగుల వరకు గుంతలు తీస్తే కానీ నీరు కనబడని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో పై ప్రాంతాల నుంచి నీరు రావడంతో చెన్నూరు వద్ద నదిలో స్వల్పంగా నీటి ప్రవాహం సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా రెండు నెలలుగా నది అంతా ఎండిపోయి ఇసుక నుంచి విపరీతమైన వేడి వచ్చేది. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కడప నగరానికి నీటిని వదిలే నిమిత్తం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచఇ కేసీకాల్వ వాటర్ గండి ద్వారా నీటిని పెన్నాలోకి వదిలింది. దీంతో నగరానికి తాగునీటి సమస్య తప్పింది అయితే రైతులు కేవలం నగరానికేనా.. చెన్నూరు ఖాజీపేట రైతులు ప్రభుత్వానికి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పెన్నానదిలోకి సోమవారం నుంచి నీటి ప్రవాహం చిన్నగా సాగడంతో ఇక తాగునీటికి రైతుల బోర్లలో నీటి మట్టం పెరిగేందుకు ఎలాంటి ఇబ్బందిలేదంటున్నారు. వర్షాలు కురిసే వరకు నదిలో నీటి ప్రవాహం తగ్గించవద్దని ఎక్కడ నుండి నీటిని నదికి వదిలారో నీటిని ఆపవద్దని కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప (ఎర్రముక్కపల్లె), మే 21: కడప నగరం మెడికేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. శిబిరంలో దాదాపు ఏడు వేల రూపాయలు విలువైన ఫైబ్రో స్కాన్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాటీ లివర్ తరచూ నిశ్శబ్దంగా ఉంటుందని, కాలేయం పరిస్థితులను ట్రాక్ చేయడానికి అవసరమైన పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించడం ముఖ్యమన్నారు. ప్రారంభ కాలంలోనే రోగులకు నిర్దిష్ట సమస్యలు ఎదురవవని, వ్యాధి అభివృద్ధి చెందే దశలో అస్పష్టమైన కుడివైపు పొత్తి కడుపు నొప్పి, అలసట, కొన్ని తేలికపాటి బలహీనత వంటి లక్షణాలను అనుభవించ వచ్చన్నారు. రోగుల పాదాలు పొత్తికడుపు వాపు, రక్తపు వాంతులు, గందరగోళం, సులభంగా గాయాలు, అధిక రక్తస్రావం, కండర ద్రవ్యరాశి కోల్పోవడం కామెర్లు వంటి సమస్యలు ఎదుర్కొంటారన్నారు. కొవ్వు కాలేయం నిర్ధారణ అయిన తరువాత రోగికి వ్యాధిని నిర్ధారించడం కీలకమన్నారు. వ్యాధి అధునాతనదశలను నిర్ధారించడానికి కొన్ని సార్లు కాలేయ బయాప్సీని ఉపయోగిస్తారన్నారు. ఫైబ్రోసిస్ స్థాయిని ఇపుడు రక్తపరీక్షలు ఫైబ్రో స్కాన్ వంటి స్కాన్‌లు సహా నాన్ వాసిబ్ పరీక్షల ద్వారా అంచనా వేయవచ్చన్నారు. ఇది ఫైబ్రో సిస్ స్థాయిని ఫిబ్రోసిస్ ప్రారంభ దశను ఖచ్చితంగా నిర్ధారించడానికి ఈ స్కాన్ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఈ పరీక్ష కడప నగరంలో ఉచితంగా అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సయ్యద్ నూర్, షాహిద్ పఠాన్, గౌతమి, ఆయేషా, శిరీషారెడ్డి, మౌలానా, సువర్ణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చక్రాయపేట, మే 21: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25కు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ షేక్ రంతుబాష తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30లోపు సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాలలో 90శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

'రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడు'

వేంపల్లె, మే 21: కాంగ్రెస్ జాతీయ మాజీ అధ్యక్షుడు, మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో కాంగ్రెస్ నేతలు నిర్వహించిన రాజీవ్‌గాంధీ వర్ధంతిలో ఆయన మాట్లాడుతూ జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయోపరిమితిని 18ఏళ్లకు తగ్గించిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారితకు కృషిచేసిన మహిళా పక్షపాతి అన్నారు. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన దార్శనికుడన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి రాజీవ్‌గాంధీ ఆద్యుడన్నారు. కాంగ్రెస్ నేతలు రామకృష్ణ, వేమయ్య, బాబు, అమర్, ఉత్తన్న, మాస్, ఖాసీం, కుక్కల రాజ, బాలం సుబ్బరాయుడు, రవి పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

క్రిష్ణ సర్కిల్ వద్ద కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్





క్రిష్ణసర్కిల్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), మే 21: ఎన్నికల ఫలితాల సమయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నేతలు వారి అనుచరులు పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఏదైనా సమయంలో గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ స్పష్టం చేశారు. కడప నగరం క్రిష్ణ సర్కిల్ వద్ద స్పెషల్ పార్టీ బృందాలతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. గొడవలు జరుగుతున్నప్పుడు పోలీసులు వాటిని ఎలా నిరోధించాలి, అల్లరి మూకలను ఎలా అదుపులోకి తేవాలో డెమోచేసి చూపించారు. గాల్లో ఫైరింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని గెలిచిన వారు సంతోషంగా ఉన్నా ఓడినవారు బాధతో ఉన్నా శాంతియుతంగానే ఉండాలని అనుమతులు లేకుండా బాణసంచా పేల్చినా చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ నాయకులే కాకుండా ప్రజలు వారి కార్యకర్తలు కూడా పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కడప నగరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం క్రిష్ణసర్కిల్ నుంచి పోలీసు అధికారులతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, సీఐలు ఎస్‌ఐలు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుకాల దీప కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం



ఆలయంలో కొలువైన అమ్మవారు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్) మే 21: నగర బిల్టప్ సర్కిల్ సమీపంలో వెలసిన విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం నిర్వహించిన రాహుకాల పూజలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో రాహుకాలపూజ చేసి నిమ్మకాయలతో కూడిన దీపాలను వెలిగిస్తే కోరుకున్న కోరికలు నెరవేరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అమ్మా అని పిలిస్తే నేనున్నా అని పలికే బంగారు తల్లి మన విజయదుర్గా దేవి. ఆ తల్లిని అందరూ దర్శించి తరించాలనే మంచి మనసుతో మల్లికార్జునరావు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో నిత్యపూజా కైంకర్యాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ పర్యవేక్షిస్తారు. 23వ తేదీ గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం, చండీహోమం, 108 మంది ముత్తైదువులచే అమ్మకు 108 దీపాలతో అలంకార సేవ నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేయండి

కడప (మారుతీనగర్) మే 21: దళితుల్లో సామాజిక చైతన్యం తీసుకురావాలనే ఏకైక లక్ష్యంతో అనంతపురం జిల్లా పామిడి మండలంలో అక్టోబర్ 7న తలపెట్టిన దళిత మిత్రసంఘం రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దళితులు తరలిరావాలని రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ నగర్‌లోని దళిత మిత్రసంఘం కార్యాలయంలో చేపట్టిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించిన అయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ స్థాయిల్లో కమిటీలను పూర్తిచేశామన్నారు. ఆ కమిటీల ద్వారా కొన్ని సమస్యలను తీర్చినట్లు స్పష్టం చేశారు. మరికొన్ని సమస్యలు పరిష్కరించాల్సివుందని, ఆ కోవలో దళితుల్లో పరివర్తన తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దళిత మిత్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్, అధికార ప్రతినిధి పి. నాగభూషణం, జిల్లా అధ్యక్షులు కైపు బాబు, ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ ఓబులేసు, దళితమిత్ర మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు బుజ్జమ్మ, ఉపాధ్యక్షురాలు అమరేశ్వరి యువసేన జిల్లా అధ్యక్షుడు పి. మనోహర్, చిన్నమండెం మండల అధ్యక్షులు రెడ్డప్ప, ఉపాధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం



చక్రాయపేట, మే 21: గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం అందించినట్లు ఆలయ ఏసీ ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరుకు చెందిన రెండెద్దుల నాగేశ్వరరెడ్డి ధర్మపత్ని సతీదేవి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. వీరికి అర్చకులు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మోక్ష నారాయణస్వామి మూలవిరాట్టు

కమలాపురం రూరల్, మే 21: శ్రీరామాపురం క్షేత్రంలో మంగళవారం నుంచి మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాశీభట్ల సత్యసాయినాధశర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో శ్రీమహాలక్ష్మి నారాయణస్వామి కొలువైన క్షేత్రంగా విరాజిల్లుతోంది. మొదటిరోజు గరుడ వాహనంపై స్వామివారిని మాడవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ప్రజలు భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సీపీఐ ఆధ్వర్యంలో కొల్లికి నివాళి



కొల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్ర తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), మే 21: రైతాంగ సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే కొల్లి నాగేశ్వర్‌రావుకు ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లాకార్యదర్శి గాలిచంద్ర అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో కొల్లి నాగేశ్వర్‌రావు చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు విద్యార్థి దశ నుంచీ సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో నడిచిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. కరువు వలసలు, ఆత్మహత్యల శాశ్వత విముక్తి కోసం నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మాణం జరగాలని అభిలషించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.శంకర్‌రెడ్డి, కట్టా యానాదయ్య, సహాయ కార్యదర్శులు బాలచంద్రయ్య, పిచంద్రశేఖర్‌రెడ్డి, భద్రయ్య, పక్కీరప్ప, జిల్లా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ కడప క్యాప్‌ల కొనుగోలుకు కళ్యాణ్ జ్యువెలర్స్ వితరణ



కమిషనర్‌కు చెక్కును అందిస్తున్న కళ్యాణ్ జ్యువెలర్స్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), మే 21: కడప నగరం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు క్లీన్ కడప క్యాప్‌ల కొనుగోలుకు కళ్యాణ్ జ్యువెలర్స్ రూ.50వేలు విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం కడప కార్పొరేషన్ సమావేశ మందిరంలో కమిషనరు ప్రవీణ్‌చంద్‌కు కళ్యాణ్ జ్యువెలరీస్ ప్రతినిధి చెక్కును అందించారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ క్యాప్‌ల కొనుగోలుకు కళ్యాణ్ జ్యువెలర్ విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. గతంలో కూడా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ కడప నగర పాలక సంస్థకు లక్ష రూపాయలు విరాళంగా అందించిన విషయంగుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ జ్యోవెలర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శేష వాహనంపై కొలువైన నృసింహస్వామి



పెండ్లిమర్రి, మే 21: జిల్లాలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం వెయ్యినూతులకోన లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి శేషవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం అష్టోత్తర శతకలశ స్నపనం గావించారు. అర్చకులు స్వామి, అమ్మవార్లను అలంకరించారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

దువ్వూరు(మైదుకూరు), మే 21 : వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంగా ఉంటేనే ప్రజా సమస్యలు కూడా వెంటనే పరిష్కారం అవుతాయని, ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొనాలని మండల ప్రత్యేక అధికారి మైఖేల్ రాజీవ్ పేర్కొన్నారు. ఉద్యానశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన మంగళవారం మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్మిస్తున్న పక్కా గృహాలకు వెంటనే పూర్తి చేయాలని, తహసీల్దారు ఉమారాణి, ఎంపీడీవో సుగుణశ్రీ, హౌసింగ్ ఏఈ వై శాంతి, పీఆర్ ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంట పొలాల రస్తా ఆక్రమణ

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం

ప్రొద్దుటూరు ,మే 21 : ప్రొద్దుటూరు మండలం తాళ్ళమాపురం గ్రామ పొలంలోని సర్వేనెంబరు 83 పంటపొలాల రస్తా ఆక్రమణపై రైతులు మండల సర్వేయర్లతో సర్వేచేపట్టారు. ఈ సర్వే సందర్భంగా మంగళవారం వివాదం చెలరేగింది. దీంతో రూరల్ ఎస్‌ఐ శివప్రసాద్ జోక్యంతో ప్రైవేటు వెంచరు యజమానులతో రైతులతో మాట్లాడి వివాదం సర్దుబాటుకు చర్యలు చేపట్టారు. ప్లాట్ల వ్యాపారుల స్వార్థంతో రైతుల పంటపొలాల రస్తా సమస్య వివాదానికి దారి తీసినట్లు రెవెన్యూ సిబ్బంది తెలుపుతున్నారు. రెవెన్యూ రికార్డుల మేరకు పంట పొలాల రస్తా ఇరువైపులా ఎంత మేరకు వుందో తేల్చాలని కోరతూ కానపల్లె రైతు బండివెంకట రమణారెడ్డి పెట్టిన సర్వే దరఖాస్తుతో సర్వేచేపట్టారు. కానీ రోవర్‌కు సాంకేతిక సమస్య ఎదురవ్వడంతో సర్వే నిలిపివేశారు. తిరిగిరెండురోజుల్లో సర్వేచేపడతామని వారు తెలిపారు.

లారీ టైర్లు దగ్ధం



ముద్దనూరు మే21:స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మంగళవారం లారీ టైర్లు దగ్ధమయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు.., మంగళూరు నుంచి చిలమకూరుకు ఐరన్ మట్టిని లారీలో తరలిస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలోకి రాగానే టైర్లలో మంటలు చెలరేగాయి. దీంతో నాలుగు టైర్లకు నిప్పు అంటుకుంది.దీంతో డ్రైవర్ అహమ్మద్ అప్రమత్తమై లారీ నిలిపివేశాడు. జమ్మలమడుగు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

ప్రొద్దుటూరు, మే 21 : రాజీవ్ గాంధీతోనే దేశం వేగవంతంగా అభివృద్ధి అయ్యిందని అలాంటినేతను తీవ్రవాదం పొట్టన పెట్టుకుందని కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ పీఎండీ నజీర్‌తెలిపారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనస్, అలీ, సుబీర్, మోహీద్దీన్, ఖలందర్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు మే 21 : లింగనిర్ధారణ చట్టరీత్యానేరమని ఎవ్వరైనా ఆసుపత్రులలో స్కానింగ్ సెంటర్లలలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతికళ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్‌సెంటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి స్కానింగ్‌లు చేస్తే 50వేల రూపాయల జరిమానాతోపాటు స్కానింగ్‌సెంటర్ అనుమతులను రద్దుచేస్తామని హెచ్చరించారు.

నిలువ నీడెక్కడ..?

● బస్టాండు .. షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు ● ఎప్పుడు కడతారో ఆ కాలజ్ఞానికే ఎరుక

మైదుకూరు, మే 21 : బ్రహ్మంగారిమఠంలో ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా బస్సు షెల్టర్ లేదు. చారిత్రక, దర్శనీయ స్థలంగా పేరుపొందిన బ్రహ్మంగారిమఠానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు కాకుండా ఇతర దేశాల నుంచి అనేక మంది భక్తులు వస్తూ పోతుంటారు. ఈ క్షేత్రంలో ప్రయాణికులు, భక్తులు బస్సుల కోసం వీధుల్లో నిలబడాల్సివస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి 10 ఏళ్ళుగా చెబుతూ ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకపోయినట్లు బహిరంగంగా చెప్పినా ఇంత వరకు కనీసం ఆ దిశగా అమలుకు నోచుకోలేదు. ఎండ,వాన, పగలు రాత్రి అనక భక్తులు, ప్రయాణికులు నడిరోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తుండిపోతున్నారు. బ్రహ్మంగారి మఠం ఆలయానికి ప్రతి ఏటా జరిగే ఆరాధన ఉత్సవాల్లో కనీసం 3 లక్షల మంది భక్తులు పాల్గొంటారు. ఆలయానికి భక్తుల నుంచి హుండీ ద్వారా వచ్చే ఆదాయం ఏడాడికి దాదాపు 4నుంచి 5 కోట్ల వరకు వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ విఫలమవు తున్నారు. భక్తులు నిలబడేందుకు కనీసం షల్టర్ కూడా లేక పోవడం గమనార్హం.

అభివృద్ధి పేరుతో కూల్చివేత..: బి మఠం కూడలిలో అతి పురాతంగా ఓ షల్టర్ ఉండేది. బ్రహ్మంగారిమఠాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో



బి మఠంలో షల్టర్ కూల్చిన ప్రాంతంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బి.మఠంలో బస్సుకోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు

మూడేళ్ళ క్రితం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్థానిక నాయకులతో కలసి షల్టర్‌ను కూల్చేశారు. తదుపరి చర్యలనిమిత్తం ఆ ప్రాంతంలో ప్రయాణికులు నిలబడేందుకు కనీసం నీడనిచ్చే ఇనుప రేకులు కూడా వెయ్యలేదు. బస్టాండ్ నిర్మాణానికి తగిన పనులు కూడా ఏ మాత్రం చేయక పోవడంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారు.

దువ్వూరులోనూ అంతే...: మండల కేంద్రమైన దువ్వూరులోనూ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరులో బస్టాండ్ నిర్మించాలని పలు మార్లు స్థానికులు ఆందోళనలు చేస్తూ అధికారుల దృష్టికి తీసుకపోయారు. దీంతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందించి త్వరలోనే ఏర్పాటు చేయిస్తా అంటూ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు స్థల సేకరణకు వచ్చివెళ్ళిపోయారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నేరవేర్చడంలో విఫలమయ్యారు. శాసనసభ్యుడిగా పదవీకాలం ముగిసిపోతున్నా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులకు నోచుకోని ఆర్టీసీ బస్టాండు

ప్రాంగణంలో ఫ్యాన్లు లేవు, తాగునీరు లేదు ● ఇదీ బద్వేలు ఆర్టీసీ బస్టాండు దుస్థితి



ప్రయాణికులువేచి ఉండే ప్రాంగణంలో ఒక్క ఫ్యాను లేని దృశ్యం, ఇటీవల కూలిపోయిన బస్టాండులోని ఓ ప్రాంతం

బద్వేలు రూరల్, మే 21 : సాధారణ మధ్యతరగతి ప్రయాణికులు తమ ప్రయాణాలను ఎన్నుకునేది ఆర్టీసీ బస్సు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమన్న నినాదంతో ముందుకెళుతున్న ఆర్టీసీ బస్టాండుల్లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించలేకపోతోంది. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంగణంలో ఫ్యాన్లు కానీ, తాగునీరు కానీ వసతులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. బద్వేలు ఆర్టీసీ బస్టాండులో ఏ మౌళిక వసతులు ఏర్పాటు చేయకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా బద్వేలు ఆర్టీసీ బస్టాండును 1986లో ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే బస్టాండు అభివృద్ధి ఉందని చెప్పవచ్చు. అన్నిమార్గాలకు వెళ్లే బస్సులు బద్వేలు మీదుగా వెళ్లాల్సి ఉన్నా చుట్టుపక్కల ప్రయాణికులు ఇక్కడ వేచి ఉండాల్సి ఉన్నా ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి పరచలేకపోయారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

నెల్లూరు, చెన్నై, ప్రాంతాలకు జంక్షన్..: నెల్లూరు, చెన్నై విజయవాడ ప్రాంతాలకు వెళ్లాలంటే జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి అయినా బద్వేలు మీదుగా వెళ్లాల్సిందే. ఆర్టీసీలో ఓ మోస్తరు జంక్షన్ అయిన బద్వేలు ఆర్టీసీ బస్టాండు ఏ మాత్రం అభివృద్ధి చేయలేకపోయారు. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంగణంలో ఫ్యాన్లు కానీ, తాగునీరు కానీ లేకపోవడంతో వేచి ఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

54 సర్వీసులు..: బద్వేలు ఆర్టీసీ డిపోలో బాడుగ బస్సులతో కలిపి 54 సర్వీసులు నడుపుతున్నారు. అందులో కొన్ని కాలం చెల్లిన బస్సులను కూడా నడుపుతుండడంతో బస్సులు మార్గమధ్యంలో ఎక్కడంటే అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బద్వేలులో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో బస్టాండులో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. అటువంటి బస్టాండులో మౌలిక సదుపాయాలు లేకపోవడం ప్రయాణికులు తీవ్ర కష్టాలు పడుతున్నారు.



భవనం పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

శిథిలావస్థకు చేరిన బస్టాండు..: 38 సంవత్సరాల కిందట నిర్మించిన ఆర్టీసీ బస్టాండు భవనం పైపెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవలే బస్టాండులోని ఓ వైపు సన్‌షైడ్ భాగం కూలిపోవడం కూడా చోటు చేసుకుంది. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టి మరమ్మతులు చేయలేకపోయారు. భవన ప్రాంగణం శిథిలావస్థకు చేరడంతో నిత్యం వందలాది మంది వేచి ఉండే ప్రాంగణంలో ప్రాణాపాయం జరిగే అవకాశం కూడా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ మురళీధర్



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం, మే 21 : శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. పట్టణంలోని సంజీవనగర్‌లో పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్స్ లేని 64 మోటారు సైకిళ్లు, 6 ఆటోలు సీజ్ చేసినట్లుగా డీఎస్పీ మురళీధర్ చెప్పారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున స్థానిక పోలీసు అధికారులు తమ సిబ్బందితో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కొత్తవ్యక్తులు ఉన్నారేమో వాకబు చేశారు. ఎలక్షన్ ఫలితాలు వెలువడే రోజు గొడవలు పెట్టుకుని శాంతిభద్రతలకు భంగం వాటిల్లిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సీఐలు యుగంధర్, శ్రీకాంత్, అబ్దుల్ కలీం, వెంకటరమణ, రమణారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల అనంతరం శాంతియుతంగా వ్యవహరించాలి

బద్వేలు రూరల్, మే 21 : ఎన్నికల ఫలితాల అనంతరం అన్ని రాజకీయ పార్టీల నాయకులు శాంతియుతంగా వ్యవహరించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు చేపడతామని రూరల్ సీఐ విక్రమసింహ తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ స్టేషన్‌లో బద్వేలు, గోపవరం గ్రామణ స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ పార్టీల నాయకులు శాంతియుతంగా ఉండాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ గుంపులుగా లేకుండా ఉండాలని హెచ్చరించారు. అనంతరం రాజకీయ పార్టీ నాయకులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

జమ్మలమడుగు ,మే 21 : జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ పాలిటెక్నిక్ కళాశాలప్రాంగణంలో జరుగుతుందని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆర్డీవో కార్యాయంలో ఎమ్మెల్యే ఎంపీ ఓట్ల లెక్కింపులో అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు తెలియ జేశారు. జూన్ 4 జరిగే కౌంటింగ్ రోజు అభ్యర్థులు ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలని తెలిపారు. 8గంటలనుంచి పోస్టల్‌బ్యాలెట్‌లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. 8.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు మొదలుపెడతారన్నారు. కౌంటింగ్ కేంద్రంలో డిజిటల్ డిస్ప్లే ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల నేతలు తమ వాహనాలను కౌంటింగ్ కేంద్రం వద్దనే నిలిపివేయాలన్నారు. 16టేబుళ్లకు 2 టేబుళ్ల పోస్టల్ బ్యాలెట్లకు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో , తహసీల్దారు కరుణాకర్ ఎస్ఐ తిమోతీ, వివిధ పార్టీలనుంచి పాముల బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి, శివనారాయణరెడ్డి ,పోచిరెడ్డి రామాజీ ఇమ్మానియేలు పాల్గొన్నారు.

పందుల బెడద - స్థానికులకు ఇక్కట్లు



ఎత్తపువారి కాలనీ, పెద్దపోస్టాఫీసు సమీపాన స్వైరవిహారం చేస్తున్న పందులు

జమ్మలమడుగు, మే 21: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో గ్రామాల్లో పందుల బెడద అధికంగా ఉంది. పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, ట్యాంకు వీధి నుంచి ఇరువైపుల కాలువల్లో, ఎత్తపువారి కాలనీ, మిఠాయిగిరి కాలనీ ఉర్దూ హైస్కూలు సమీపాన, బీసీ కాలనీ ఎస్సీ కాలనీ, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచిన ప్రాంతాల్లో వ్యర్థాలు ఉన్నచోట పందులు చేరి అపరిశుభ్రత చేస్తున్నాయి. డ్రైనేజీ కాలువల్లో నీరు కదలక దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది.

ప్రొద్దుటూరులో కుక్కల స్వైర విహారం

దాడులు చేస్తున్నా మేలుకోని అధికారులు ● నియంత్రణా చర్యలపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం

ప్రొద్దుటూరు, మే 21 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రోడ్ల మీద వాహనాల్లోవెళ్లే వారిని వెంటబడుతున్నాయి. చిన్న పిల్లలు రోడ్లమీద వెళ్ళాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కానీ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వీటిని పట్టుకుని డంపింగ్ యార్డులోని కుక్కల ఆసుపత్రికి తరలించకుండా మీనమేషాలు లెక్కపెడుతున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో రెండు రోజుల క్రితం తొమ్మిది మంది బాలుర పై పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో బాలురంతా ఆసుపత్రి పాలయినా అధికారులు మేలుకోవడంలేదు. ఇప్పటికీ వాటిని నియంత్రించే చర్యలకు శ్రీకారం చుట్టడం లేదు. డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన కుక్కల స్టెరిలైజ్ సెంటర్‌లో వాటికి ఆపరేషన్లు మొదలు పెట్టలేదు.స్టెరిలేజ్ సెంటర్‌ను శుభ్రంచేసే పనులు చేపట్టామని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు కానీ ఇంతవరకు వెటర్నరీ వైద్యులను పిలిపించి క్యాంపు ప్రారంభించకపోవడం పై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మున్సిపాలిటీ అధికారులు పట్టణంలోని పలువార్డుల్లో ఇదివరకే సర్వే చేసిన కుక్కల గుంపులపై వున్న లెక్కలతో వాటిని పట్టుకోని స్టెరిలైజ్‌సెంటర్‌కు తరలించాలని కోరుతున్నారు.



జిల్లాలో 6,41,290 నోట్‌పుస్తకాలు పంపిణీకి సిద్ధం

ఎర్రగుంట్ల, మే 21: 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,42,780 విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. వీరికి 8,19,960 నోట్‌బుక్కులకుగాను ఇప్పటి వరకు 6,41,290 వచ్చినట్లు వాటన్నింటినీ వివిధ మండలాలకు పంపిణీచేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి అనురాధ తెలిపారు. బ్యాలెన్స్ నోట్‌బుక్కులు రెండు, మూడు రోజుల్లో వస్తాయని వాటన్నింటిని కూడా వెంటనే ఆయా మండలాలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, బూట్లు,యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, వర్క్‌బుక్స్‌కు సంబంధించిన ఇండెంట్ పెట్టామన్నారు. అవికూడా అతిత్వరలో జిల్లాకు వస్తున్నట్లు, వచ్చిన వెంటనే ఆయా మండలాల్లోని ఎంఈవోలకు పంపుతున్నట్లు ఆమె వివరించారు. పాఠశాలలు తెరవగానే వీటిని పంపిణీ చేస్తామన్నారు. ఎర్రగుంట్ల మండలానికి సంబంధించి 22,030 నోట్‌పుస్తకాలు వచ్చాయి.



ఎర్రగుంట్లలో నోట్ బుక్కులను వివిధ పాఠశాలలకు పంపిణీ చేస్తున్న దృశ్యం

కనుమరుగవుతున్న పంట పొలాలు

రియల్ ఎస్టేట్‌గా మారుతున్న వైనం ● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పోరుమామిళ్ల, మే 21 : పంట పొలాలకు చెరువు ద్వారా నీరందించేందుకు గతంలో కాల్వలు ఏర్పాటు చేస్తే కొందరు తమ స్వార్థానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధన దాహానికి ఆ పంట కాల్వలు కనుమరుగు అవుతున్నాయి. పచ్చని పొలాలకు నీరందించే పంట పొలాలు రాను రాను పూడి పోతున్నాయి. పోరుమామిళ్ల చెరువుకు మల్లకతవ దిగువన ఉన్న బెల్లగోడి కాల్వ ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందేది. అలాగే ఆ కాల్వ చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బోర్లకు నీరు పుష్కలంగా ఉండేది. బెల్లగోడి కాల్వ ద్వారానే రంగసముద్రం చెరువుకు నీరు చేరేది. ఫలితంగా బెల్లగోడి కాల్వ ద్వారా ఆ చుట్టుపక్కల ఉన్న వందలాది ఎకరాల్లో పైర్లు పండేవి. రంగసముద్రం చెరువుకు కూడా ఈ కాల్వ ద్వారా సాగునీరందించేది. ఇంత ప్రాధాన్యత కలిగిన బెల్లగోడి కాల్వ అధికారుల నిర్లక్ష్యానికి కంపచెట్లు పెరిగి ప్లాస్టిక్ కవర్లతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా నీరు కలుషితం కావడం రంగసముద్రం చెరువుకు సక్రమంగా నీరు చేరడంలేదు. ఈ కాల్వపై ఆధార పడిన వందలాది ఎకరాలు సాగు భూమి బీడు భూములుగా మారాయి. కొందరు బెల్లగోడి కాల్వ ద్వారా నీరు రాకుండా ప్లాస్టిక్ కవర్లను నింపివేశారు. మల్లకతవ నుంచి రెడ్డికొట్టాల వెళ్లే దారి వరకు కాల్వకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. చుట్టుపక్కల ఉన్న పొలాల్లో కూడా రియల్ ఎస్టేట్ పొలాలుగా మార్చివేశారు. అంతేకాక బుగ్గబావి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా తెలుగుగంగ సహకార బ్యాంకు సమీపంలో ఉన్న భవనం ద్వారా పంట పొలాలకు అక్కడున్న కాల్వల ద్వారా నీరందేది. కొన్నేళ్లుగా వ్యాపారులు కొందరు కాల్వలను పూడ్చివేయడం, కింది భాగాన ఎవరూ పొలాలు వేయడం లేదు. అలాంటప్పుడు ఈ కాల్వలు ఎందుకు, మనం స్వాధీనం చేసుకుంటే సరిపోతుంది కదా అన్న రీతిలో ఆ కాల్వలను కూడా తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న పంట పొలాలకు సంబంధించిన కాల్వలు చెన్నకేశవస్వామి దేవాలయం వరకు నీరు సాగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సమీపంలోని కాలవలు చూస్తామన్నా కనిపించే పరిస్థితి లేకండాపోయింది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు పంట కాల్వలు గుర్తించి వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





బ్రాందిషాపు సమీపంలో బెల్లగోడి కాల్వలో పెరిగిన కంపచెట్లు, ప్రైవేటు కళాశాలల పక్కన కనుమరుగవుతున్న కాల్వలు